పురం .. ప్లాస్టిక్ మయం !

- వ్యాపార దుకాణాలు, హోటళ్లలో యథేచ్ఛగా ప్లాస్టిక్ కవర్ల వినియోగం
- నిబంధనలకు తిలోదకాలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

హిందూపురం/హిందూపురం అర్బన్: రుచిగా .. మెత్తగా ఉండే ఇడ్లీ తయారీలో ప్లాస్టిక్ కవర్‌ను వినియోగిస్తున్నారని ఎంత మందికి తెలుసు? బయట హోటళ్లలో లభించే ఆహారంలో ఇడ్లీనే మంచిదని చాలమంది అనుకుంటారు. దాన్ని తయారు చేసే సమయంలో అదే ప్లాస్టిక్ కవర్ ఇడ్లీ పాత్ర కింద వేసి వేడికి మరగనిస్తారు. ఇడ్లీ అయిన తరువాత తీసేందుకు, శుభ్రం చేసేందుకు సులభంగా ఉంటుందని 70 శాతం హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల నిర్వాహకులు వాడుతున్నారు.

హోటళ్లలోనే ఎక్కువ..

హిందూపురం పట్టణంలోని వాసవీ ధర్మశాల రోడ్డు .. అల్పాహారం.. నోరూరించే రుచులకు పెట్టింది పేరు. ప్రతిరోజూ సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకూ హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో రద్దీ విపరీతంగా ఉంటుంది. దోసె, ఇడ్లీ, రోటీ, దాల్, పూరీ.. ఇలా ఎవరు కోరిన ఆహారం వారికి ఇస్తూ వ్యాపారులు నాణ్యత, పరిశుభ్రత విషయాన్ని మాత్రం గాలికి వదిలేస్తున్నారు. ఇక్కడి వ్యాపారులు విపరీతంగా అన్నింటికీ ప్లాస్టిక్ వినియోగిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. అలాగే బైపాస్ రోడ్డు, కట్టకింద హోటళ్లలో రోటీ, దాల్, తట్టల్లో ప్లాస్టిక్ కవర్స్ వాడుతున్నారు. మడకశిరలో, గోరంట్ల, పెనుకొండల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. ఇదేమని ప్రశ్నిస్తే తప్ప దాన్ని తీసివేయడం లేదు. కొడికొండ చెక్ పోస్టు, చిలమత్తూరు. లేపాక్షిలో హోటళ్ల నిర్వాహకులు ఇడ్లీ పాత్రల కింద భాగంలో ప్లాస్టిక్ కవర్లు 70 శాతం మంది వాడుతున్నారు. అలాగే సమోసా, గారెలు, బజ్జీలు వడలు ఇలా అన్ని పదార్థాల పార్శిళ్లకూ వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లనే వాడుతున్నారు.


సరుకులను ప్లాస్టిక్ కవర్లలో తీసుకెళ్తున్న మహిళ


పూల విక్రయాలకు వినియోగిస్తున్న ప్లాస్టిక్ కవర్లు

40 మైక్రాన్ల కంటే తక్కువ ఉంటే ప్రమాదం

హిందూపురంతో పాటు మిగిలిన ప్రాంతాల్లోనూ తక్కువ మైక్రాన్లు ఉన్న ప్లాస్టిక్ కవర్స్ నిషేధిస్తూ, రిస్టికింగ్‌ని అరికట్టాలని మున్సిపల్ కమిషనర్లకు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. 40 మైక్రాన్‌ల కంటే తక్కువ ఉన్న ప్లాస్టిక్ కవర్ల వినియోగిస్తుంటే వారిపై కఠిన చర్యలు తీసుకొని భారీగా జరిమానా విధించి వాటిని స్వాధీనం చేసుకుని నాశనం చేయాల్సి ఉంది. నిబంధనలు పటిష్టంగా అమలు కాకపోవడంతో ప్లాస్టిక్ వినియోగం అంతకంతకూ పెరిగిపోతోంది.

విచ్చలవిడిగా వినియోగం

జిల్లాలో స్పెషల్‌గ్రేడ్ మున్సిపాల్టీగా ఉన్న హిందూపురంలో ప్లాస్టిక్ కవర్ల వినియోగం విపరీతంగా పెరిగిపోయింది. మాంసం దుకాణాలు, కిరాణా దుకాణలు, కాయగూరలు, పండ్ల విక్రయాలు, బేకరీలు, హోటళ్లు ఇలా అన్నిచోట్ల తక్కువ మైక్రాన్లు కల్గిన ప్లాస్టిక్ కవర్లనే వినియోగిస్తున్నారు. గుర్తుంచు వచ్చినప్పుడల్లా తూతూ మంత్రంగా తనిఖీలు చేసి అధికారులు చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలున్నాయి.

జాగ్రత్తలు పాటించాలి



కల్తీ ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. కాలేయ, గుండె సంబంధిత వ్యాధులు, హైపర్ టెన్షన్, కొవ్వుపెరగడం, స్థూలకాయం, క్యాన్సర్ రోగాల బారిన పడే అవకాశముంది. కొన్ని హోటళ్లలో వాడిన నూనెనే మళ్లీ వాడుతుంటారు. అందులో తయారు చేసిన పదార్థాలు తినడం ద్వారా అనారోగ్య సమస్యలు ఖాయం. ఆహారం తీసుకోవడంలో ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించడం మంచిది.

– సతీష్‌రెడ్డి, వైద్యుడు, మడకశిర

కఠినంగా వ్యవహరిస్తాం



పట్టణంలో ప్లాస్టిక్ కవర్ల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాము. ఇప్పటికే దాడులు చేసి జరిమనాలు విధిస్తున్నాము. ప్రజలు కూడా పర్యావరణానికి హానికరమైన ప్లాస్టిక్ కవర్లను వినియోగించడం మానుకోవాలి. వాటిబదులు పేపర్, జనుము సంచులను వాడుకోవాలని అవగాహన కల్పిస్తున్నాము. పట్టణంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టి దొరికితే జరిమానాలు అవసరమైతే కేసులు కూడా పెడతాం.

– శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, హిందూపురం.

క్లుప్తంగా

పాఠశాల బస్సుల తనిఖీ


స్కూల్ బస్సును తనిఖీ చేస్తున్న ఎంవీఐ శివశంకర్

హిందూపురం అర్బన్: స్థానిక రవాణాశాఖ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ సోమవారం పట్టణంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలలకు చెందిన బస్సులను ఆపి తనిఖీ చేశారు. వాహనం ఆపి డ్రైవర్ వివరాలు, బస్సు రూటు, ఆరూటులో వెళ్లే విద్యార్థుల వివరాలు బస్సులో ఉన్నాయా? లేదా ? అన్నది పరిశీలించారు. బస్సు అటెండర్ , డ్రైవర్లకు పలు సూచనలు చేశారు.

పారిశుధ్య పనుల పరిశీలన

మడకశిర: మున్సిపల్ కమిషనర్ రంగస్వామి సోమవారం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. వివిధ వార్డుల్లో పర్యటించి కార్మికులు పారిశుధ్యం పనులను ఎలా నిర్వహిస్తున్నారో పరిశీలించారు. కాలువలు, రోడ్లను శుభ్రం చేసే పనులను పరిశీలించడమే కాకుండా చెత్త కుప్పలను తొలగించే పనులను చూసి సూచనలు చేశారు.

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి


రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ భాస్కర్

మడకశిరరూరల్: మండల పరిధిలోని గుండుమల గ్రామంలో కేజీబీవీ పాఠశాలను సోమవారం ఎంఈఓ భాస్కర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించారు. విద్యా ప్రగతి, భోజన పథకం అమలు తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ బాలికలు క్రమశిక్షణతో చదువుకుని భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. వంట గది, తరగతి గదులను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థుల చదువుపై దృష్టి సారించాలన్నారు.

విశ్రాంత వీఆర్ఓ మృతి

అమరాపురం: మండలంలోని కాచికుంటకు చెందిన విశ్రాంత వీఆర్‌ఓ శ్రీనివాసగౌడ్ (72) సోమవారం అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాగేష్‌తో పాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులు కాచికుంట గ్రామానికి వెళ్లి ఆయన భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు.

ఇసుక డంప్ చేసిన వ్యక్తి అరెస్టు

గోరంట్ల: మండల పరిధిలోని గంగాదేవపల్లి సమీపంలో ఇసుకను అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలించేందుకు డంప్ చేస్తున్న జేసీబీ డ్రైవర్‌ను ఆదివారం రాత్రి అరెస్టు చేసినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. అలాగే ఇసుక డంపు చేయడానికి వినియోగించిన జేసీబీని సీజ్ చేశామన్నారు. చిత్రావతి నది నుంచి అక్రమంగా ఇసుక తవ్వి జేసీబీ సహాయంతో సమీప పొలాల్లో డంప్ చేస్తున్నట్లు గుర్తించామన్నారు.

త్వరలోనే ఐటీఐ, డిప్లొమా కళాశాల ఏర్పాటు


విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించిన ఎమ్మెల్యే వెంకటేష్

పావగడ: పిల్లలకు చదువునే ఆస్తిగా చేయాలని, ఇతర ఆస్తుల కంటే చదువే శాశ్వతమని ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్ తల్లితండ్రులకు సూచించారు. స్థానిక ఎస్ఎస్‌కే సముదాయ భవనంలో శివకుమారస్వామీజీ, డా ఏపీజే అబ్దుల్ కలాం అభిమానుల సంఘం అధ్యక్షుడు రిజ్వాన్ ఉల్లా ఆధ్వర్యంలో సోమవారం ప్రతిభా పురస్కారాల ప్రదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలోనే పట్టణంలో ఐటీఐ, డిప్లొమా కళాశాలలు ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే బై పాస్ రోడ్డు నిర్మిస్తామన్నారు. అనంతరం పీయూసీలో ఎక్కువ మార్కులు సాధించిన వారికి ప్రతిభా పురస్కారాలు అందించారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

రొళ్ల: మండల పరిధిలోని దొడ్డేరి ప్రాథమిక పాఠశాల ఆవరణలో సోమవారం ఎంఈఓ శ్రీధర్‌తో కలిసి 52 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు దగ్గు, ధనుర్వాధం రాకుండా ఇంజక్షన్లు వేశారు. తర్వాత రక్త పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఏఎస్ఎం వరలక్ష్మీ, ఎంఎల్‌హెచ్‌పీ జ్యోతి , ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

'అబాకస్'లో పురం విద్యార్థుల ప్రతిభ


రాష్ట్రస్థాయి పోటీల్లో బహుమతులు సాధించిన అబాకస్ విద్యార్థులు

హిందూపురం: విజయవాడలోని అయానా కన్వెన్షన్ హాల్‌లో సిప్ అకాడమీ ఆధ్వర్యంలో 28వ తేదీన జరిగిన రాష్ట్రస్థాయి సిప్ అబాకాస్ పోటీల్లో హిందూపురం సిప్ అబాకస్ విద్యార్థులు ప్రతిభ చాటి అవార్డులు సాధించారని అకాడమీ నిర్వాహకులు మాలతీ కిషోర్ తెలిపారు. విజయవాడలో సుమారు వెయ్యి విద్యార్థులు పోటీలకు హాజరయ్యారన్నారు. వారిలో హిందూపురం నుంచి 72 మంది విద్యార్థులు పోటీలో పాల్గొన్నారని చెప్పారు. సాయి ప్రవచన 10 గ్రేడ్, సాయిఅశ్విన్ 8వ గ్రేడ్ సాధించినట్లు తెలిపారు. రెండు ఛాంపియన్లు, 18 ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు 38 మంది ప్రతిభా అవార్డులు సాధించారని పేర్కొన్నారు. గెలుపొందిన క్రీడాకారులకు రాష్ట్ర అబాకస్ హెడ్ గోపాలకృష్ణ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారన్నారు.

కౌన్సిల్ మీట్‌కు పోలీసు భద్రత కల్పించండి

హిందూపురం: మున్సిపల్ సర్వసభ్యసమావేశం ఈనెల 31వ తేదీ 11 గంటలకు మున్సిపల్ ఆఫీసులో జరగనుంది. ఈ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందు జాగ్రత్తగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి వన్‌టౌన్ సీఐని లేఖ ద్వారా కోరారు. సమావేశ సమయంలో ఇతరులు కౌన్సిల్ చాంబర్ వద్ద రాకుండా గొడవలకు తావు లేకుండా చూడాలని కోరారు.

ముగిసిన శిక్షా సప్తాహ్


హిందూపురం: విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు


లేపాక్షి: విద్యార్థులకు ట్రోఫీ అందిస్తున్న ఉపాధ్యాయులు

హిందూపురం టౌన్: శిక్షా సప్తాహ్ కార్యక్రమం విద్యాభివృద్ధికి తోడ్పడుతోందని మండల విద్యాశాఖాధికారి గంగప్ప అన్నారు. సోమవారం పట్టణంలోని చౌడేశ్వరీకాలనీలోని ఎంపీయూపీ పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా చివరి రోజు శుభదిన్ భోజనం ఘనంగా ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా ఎంఈఓ గంగప్ప పాల్గొని మాట్లాడారు. ఇలాంటి కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములను చేయడం ద్వారా పాఠశాలకు, సమాజానికి మధ్య సత్సంబంధాలు ఏర్పడతాయన్నారు. విద్యార్థుల స్థితిగతులను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి వీలవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి దాత అయిన ఫైర్ ఆఫీసర్ ప్రభాకర్‌ను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుసూదన్‌రెడ్డి ఉపాధ్యాయులు ప్రేమలత, ముక్తర్, ప్రభాకర్, వసుధ, ధనలక్ష్మీ, ఫమీద, ఈశ్వర్ రెడ్డి, తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

లేపాక్షి: మండలంలో ఈనెల 22న ప్రారంభమైన శిక్ష సప్తాహ్ వారోత్సవాలు సోమవారం నాటితో ముగిసాయి. ఇందులో భాగంగా మండలంలోని పులమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో భాగంగానే విద్యార్థులకు భోజనాలు ఏర్పాటు చేశారు. అలాగే వారోత్సవాల్లో చురుగ్గా పాల్గొన్న విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావుతో పాటు గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మడకశిర : మండలం జమ్మానిపల్లి పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థులు

మడకశిరరూరల్: నూతన జాతీయ విద్యా విధానం నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం ప్రభుత్వ పాఠశాలల్లో ఘనంగా శుభ దిన్ భోజన్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ రకాల స్వీట్లతో కూడిన భోజనాన్ని విద్యార్థులకు వడ్డించారు. హెచ్ఎంలు మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి మంచి పౌరులుగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ గోపీ

లేపాక్షి: సమాజంలో విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ గోపీ సూచించారు. సోమవారం ఉదయం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో చదువుతున్న విద్యార్థినులకు సమాజంలో జరుగుతున్న దురాగాతపై అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ గుడ్ టచ్–బ్యాడ్ టచ్, పోక్సో, బాల్యవివాహాలు, సోషల్ మీడియాలో వస్తున్న వాటిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్ఓ నీలిమాతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసులు పాల్గొన్నారు.

నేడు జ్యోతుల ఉత్సవం

రొళ్ల: మండల పరిధిలోని ఎం.రాయాపురం, పిల్లిగుండ్ల గ్రామాల్లో మంగళవారం మారెమ్మదేవికి జ్యోతుల ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆయా గ్రామాల పెద్దలు తెలిపారు. ప్రతి ఏటా ఆశాఢ మాసం ఆఖరి మంగళవారం మారెమ్మదేవికి జ్యోతుల ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. మారెమ్మదేవి ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

సూపర్ సిక్స్ ఎగ్గొట్టేందుకే బాబు డ్రామాలు

- అందుకే పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశ పెట్టడంలేదు
- రాష్ట్రాన్ని మరో బీహార్‌గా మార్చారు
- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప



మడకశిర: ముఖ్యమంత్రి చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను ఎగ్గొట్టడానికి డ్రామాలు ఆడుతున్నారని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప ఆరోపించారు. సూపర్ సిక్స్‌ను అమలు చేయకూడదనే ఉద్దేశంతోనే పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశ పెట్టకుండా ప్రజలను మోసం చేయడానికి సిద్ధమయ్యాడని ధ్వజమెత్తారు. ఇందులో భాగంగానే సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందన్నారు. ఆటవిక, అరాచక పాలన సాగుతోందని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని తెలిపారు. ఎల్లో మీడియాను అడ్డం పెట్టుకుని చంద్రబాబు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని ప్రచారం చేయించి సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడానికి ప్లాన్ చేశారని స్పష్టం చేశారు. రాష్ట్ర అప్పులపై కూడా చంద్రబాబు అసెంబ్లీలో గవర్నర్ ద్వారా అబద్ధాలు చెప్పించారని విమర్శించారు. కమీషన్లకు కక్కుర్తిపడి చంద్రబాబు పోలవరం ప్రాజెక్ట్‌ను నిర్మించకుండా నాశనం చేశారన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగంతో రాష్ట్రాన్ని మరో బీహార్‌గా మార్చారని మండిపడ్డారు. వలంటీర్లకు రూ.10 వేల చొప్పున ఇస్తానని చెప్పి.. చివరకు రోడ్డున పడేసిన ఘనత చంద్రబాబుదేనని ధ్వజమెత్తారు. వైఎస్ జగన్ హయాంలో ఇసుక, మద్యం ద్వారా ప్రభుత్వానికి అధిక ఆదాయమం వచ్చిందని గుర్తు చేశారు. అధికార పార్టీ నాయకులు ఉచితం పేరుతో ఇసుకను దోచేస్తున్నారని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలను చంద్రబాబు అమలు చేయకపోతే ప్రజలు ఎదురుతిరగడం ఖాయమన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఉండి ఉంటే అమ్మఒడి, రైతు భరోసా, విద్యాదీవెన, వసతి దీవెన పథకాలు అందించి ఉండేవారన్నారు. చంద్రబాబు మోసాన్ని రాష్ట్ర ప్రజలందరూ గమనించాలని కోరారు. వైఎస్ జగన్‌కు ఓటు వేయకుండా తప్పు చేశామని అన్నిచోట్లా ప్రజలు చర్చించుకుంటున్నారని పేర్కొన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసే వరకూ సీఎం చంద్రబాబు ఎక్కడ పర్యటిస్తే అక్కడి ప్రజలు నిలదీయాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం

లేపాక్షి: ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా పనిచేయాలని జాతీయ మానవ హక్కుల సంఘం అధ్యక్షుడు భాస్కర్‌నాయుడు, దక్షిణ భారత మానవ హక్కుల సంఘం అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం మండలంలోని చోళసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

పెనుకొండ: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మంత్రి సవిత పిలుపునిచ్చారు. పట్టణంలోని మార్కెయార్డ్‌లో సోమవారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మత్తు పదార్థాలు, బాల్య వివాహాలపై అవగాహనా సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న మంత్రి యువతీ యువకులు, విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటి బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు.

వేమన జీవితం ఆదర్శ ప్రాయం


కరపత్రాలను విడుదల చేస్తున్న మంత్రి సవిత, రచయితలు

పెనుకొండ: ప్రజాకవి యోగి వేమన జీవితం ప్రజలకు ఆదర్శమని మంత్రి సవిత పేర్కొన్నారు. సోమవారం పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు జాబిలి జయచంద్ర ఆధ్వర్యంలో ఆగస్టు 25న జరిగే యోగి వేమన సాహితీ యాత్ర పోస్టర్లను మంత్రి విడుదల చేశారు. మంత్రి మాట్లాడుతూ యోగి వేమన మన జిల్లాకు చెందిన మహనీయుడు కావడం అదృష్టమన్నారు. ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్నారు.

ప్రతి సమస్యకూ పరిష్కారం చూపాలి

అమరాపురం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌డే కార్యక్రమంలో వచ్చే వినతులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారని ఎంపీడీఓ భాస్కర్ తెలిపారు. ప్రతి అధికారి కచ్చితంగా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారన్నారు.

మడకశిర నియోజకవర్గ సమస్యలు పరిష్కరించాలి

మడకశిర: ముఖ్యమంత్రి చంద్రబాబు మడకశిర నియోజకవర్గ సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే సుధాకర్ కోరారు. సోమవారం ఆయన ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఆగస్టు 1న చంద్రబాబు మడకశిర నియోజకవర్గంలో పర్యటిస్తున్నారని, తమ సమస్యలు ముఖ్యమంత్రి పర్యటనతో పరిష్కారమవుతాయని ప్రజలు భావిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా హంద్రీనీవా పథకం ద్వారా అన్ని చెరువులను కృష్ణాజలాలతో నింపాలని, రాయదుర్గం–తుమకూరు రైల్వే లైన్‌పూర్తి చేయాలన్నారు. అలాగే పారిశ్రామికవాడలో పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని, శ్రీరామరెడ్డి పథకం ద్వారా అన్ని గ్రామాలకు తాగునీరు ఇవ్వాలన్నారు. అదే విధంగా ప్రాజెక్ట్ అనంతను అమలు చేసి ఉమ్మడి అనంతపురం జిల్లాను ఆదుకోవాలని కోరారు.

సజావుగా వేలంపాట

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలో జరిగే వారపు సంతకు సోమవారం వేలం పాట నిర్వహించారు. నల్లగొండ్రాయనపల్లికు చెందిన హరికృష్ణ రూ.13.5 లక్షలకు వేలం దక్కించుకున్నట్లు పంచాయతీ కార్యదర్శి రామాంజినేయులు తెలిపారు. అలాగే దిన సంతకు సంబంధించి ఈడిగ కిష్టప్ప రూ. 50,500 హక్కులు పొందారన్నారు. సకాలంలో గ్రామ పంచాయతీకు వేలం పాటకు సంబంధించిన డబ్బులు చెల్లించాలని పంచాయితీ కార్యదర్శి పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగాదేవి, మాజీ ఎంపీటీసీ కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జ్యోతుల ఉత్సవం


జ్యోతులు మోస్తున్న మహిళలు

పరిగి: మండలంలోని శ్రీరంగరాజుపల్లిలో వెలసిన ఆంజనేయస్వామికి భక్తులు సోమవారం ఘనంగా జ్యోతులను సమర్పించారు. హిందూ సాదర కుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జ్యోతుల ఉత్సవంలో గ్రామంలోని సాదర కులస్తులంతా పాల్గొన్నారు. మేళ తాళాలు, డప్పులు వాయిద్యాల నడుమ జ్యోతులను స్వామివారికి సమర్పించారు. మంగళవారం దండు మారెమ్మకు నిర్వహించే జ్యోతుల ఉత్సవంలో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ పాల్గొంటారని గ్రామస్తులు తెలిపారు.


కత్తులతో వీరగాసే కళాకారుల ప్రదర్శన


మాను బొమ్మల సందడి